
# బిపరీత



శ్రీ ······· రామకృష్ణ ··· ఎమ్.ఏ

సామానంతా మోటారుపైన వేశారు. మెంబర్లందరూ ఎక్కి కూర్చున్నారు. గోరు వెచ్చని కామజ్వరం తగిలిన కన్నెపడుచులాగా, భారానికి బస్ వణుకు తూంది.

రాత్రికి బెజవాడలో నాటకం- బయలు దేరే వేళయింది. పిలుపుమీద పిలుపు దూకించగా, ఆ మహానుభావుడు, కునట మత్తేభ శార్దూలుడు, విమర్శకాగ్రణి, గజ గమనంతో, కారాకిల్లీ మరకల ఉత్తరీయపు వల్లెవాటితో, పొన్నుకర్ర హాలా యిస్తూ బయటికి మెట్లు దిగివచ్చి బస్ ఫ్రంట్ సీటు ప్రాంతాలకు చేరుకున్నాడు. సెల్ఫ్ క్లచ్ నొక్కి మోటారును స్టార్టుచేసిన డ్రైవరు కుర్రవాడు, చిన్నపర్వతంలాటి, ఈ డబుల్ పన్నా మనిషిని చూడటంతోనే, తెల్లబోయి, చప్పున ఆఫ్‌చేసి, క్రిందికి దిగి, కండక్టరును పిలిచి, 'ఎందుకైనా మంచిది పంప్ ఈలా తే, ఫ్రంట్ టైర్సులో గాలి చాలేటట్టు లేదు,' అని కన్నుకొట్టాడు. ఇది గమనించిన మెంబర్లు కొందరు, కుమిలి మొగాలు చాటుచేసుకుని నవ్వడం మొదలు పెట్టారు. లోహితాస్యుడు (ఆ వేషంవేసే కుర్రవాడని తాత్పర్యం) అణచుకోలేక, కొలమారినట్లు, దగ్గుతో మిలాయించి పకాలు మన్నాడు. విమర్శ కాగ్రణి, శాపాలు వర్షించే చూపు ఒకటి వాడివైపు విసరి, అంతలో సంభాళించుకుని, - ఎట్టకేలకు బస్‌ను అధిరోహించాడు.

కదలలేక - కదలలేక - కదిలింది, ఏలాగూ తప్పదుకదా అనే నిర్వేదంతో బస్. విమర్శకుడు కర్రను స్క్రీన్ ఫ్రేముకు ఓరగా ఆన్చి, వెనుకకు తిరిగి, ఏదో ఉపన్యాసం దంచడానికి ఉపక్రమించబోతూ, అట్టె ఉలిక్కిపడి, డ్రయివరును ఉద్దేశించి, తొందరగా - ఆదుర్దాతో,

'ఏయ్! హోల్డాన్!! ఆపు - ఆపు' అని దద్దరిల్లాడు.

బ్రేకులు సరిగా పనిచేయక పోవడం మూలాన ఫర్లాంగు నడిచి కాని, ఆగలేదు. అందరూ, గొడవగా ఏమిటేమిటని కారణం తరచారు. కామేశ్వరరావుగారు - విమర్శకుడి నామం ఇకనన్నా వెలువరించక పోతే బాగుండదు - సద్దు అణగనిచ్చి, తాపీగా చూస్తూ 'ఏంలేదండీ! చెప్పు ఒకటి జారిపోయింది' అన్నాడు.

అన్నాడేకాని, దిగడు - చివరకు ఓ కుర్రవాడు తీసుకురావడానికి వాలంటీరు చేశాడు. పది అడుగులు నడచిన తరువాత, మా సెక్రటరీ వాడిని కేకవేసి, వెనుకకు పిలిచి,

'ఇంకొకరిని కూడా తీసుకు వెళ్లరాదూ' అన్నాడు నెమ్మదిగా కళ్లతో నవ్వుతూ.

ఆ కొంటెవాడు, ఒకమారు తనదండల వంక చూచుకుని, 'పరవాలేదు - నేను మోయగలను లెండి' అని అందరివంకా చూస్తూ అన్నాడు...గొల్లుమన్నారు.

—మరి పది బారలు సాగిన తరువాత బస్‌కు దాహం వేసింది. మేమూ దిగాము.

రిక్తైరైన పుష్పలావిక లాటి - ఓ కాపు స్త్రీ లేత కొబ్బరికాయలు కొట్టి అమ్ముతూంది. విడి విడిగా బేరం చేస్తున్నాము - తెగలేదు. ఇంతలో రావుజీ (మాటిమాటికీ కా-మే-శ్వ-ర-రా-వు-గా-రు ఇంత దీర్ఘంగా వ్రాయడానికి బద్ధకం వేస్తూంది), రస పిపాసకుతోడు, సాదా పిపాసకూడా ఇనుమడించగా ఆ ప్రాంతానికే దయచేశారు. ఆయనను చూడటంతోనే, ఆ మనిషి—

'ఎన్నోలేవు, ముప్పై ఉన్నాయి - ఏదో ధరచేసి పుచ్చుకోండి' అన్నది.

'అన్ని ఎందుకూ?' అన్నాడు ఆయన తెల్లబోతూ.

'కాదు - మరి, తమవంటివారు...' అని ఇంకా ఏదో అనబోతూండగానే, రావుజీ, గర్జిస్తూ



'ఒకటి ఈలా కొట్టెయ్యి' అని ఉరిమాడు. ఆమనిషి, 'చెపితే - వినడు - ఏం - లాభం - పోనీ - మనకెందుకు -' అనే ఈ సడింపు చూపు

తో, పెదవి చూచాయగా విరచి, కొడవలి బొళ్లానికి లగేసింది...ఇంతలో,

—మావాళ్లందరూ, ఆఁ...ఆఁ...అని అదలించి మళ్లేయడానికి తంటాలు పడి...మీదకు వచ్చినప్పుడు తప్పుకున్నారు చేసేదేమి లేక. ఒక కారు ఆబోతు, రంకెలబుసతో, బాణావాటుగా ఎగురుకుంటూ వచ్చి, రావుజీని, 'తగరు ధరాధరంబును దార్కొని నట్టుల' కాకుండా, చులకనగా, బొళ్లాంలాగా గిరికీ కొట్టించింది.

—పడితే సరేకాని, లేవదీయడం...మాత్రమా? రొంపిలో దిగబడ్డ ఏనుగును బయటికి తీయడానికి, ఏనుగే రావాలికదూ?

ఏలా లేవనెత్తారో, దైవానికే ఎరుక:— మెల్లిగా నడుస్తూ, బస్సుదగ్గరకు వస్తున్నాడు. ఆ కొబ్బరికాయల అమ్మి, సమీపించి...

'పాపం. పడ్డారు కాబోలు...దెబ్బ తగిలిందా బాబూ' అన్నది. రావుజీ మాట్లాడలేదు.

'అంతే లెండి - దానికి అదే తెగులు ఎప్పుడూను, ఇంకొకరిని చూసి ఓర్చలేదు...'

అని, కన్నుమెలిపి మావంకచూసి...

'ఇంతకూ...ఇవాళ లేచిన వేళ మంచిది. ఇంతటితో...'

తరువాత మాటలు వినిపించుకోలేదు, ఎవరమూను, నవ్వాపుకొనే ప్రయత్నంలో. కాని, అంతటితో మాత్రం, మేము గడచి బయట పడలేదు.

మరి పదిఫర్లాంగులు సాగి బస్ అసలు మొండి కేసింది. త్వరగా బాగు చేయమని కసురుకుంటూ రావుజీ దిగలేక, దిగి...పక్కన మాను నానుకుని నిలుచుని సిగరెట్ ముట్టించాడు.

మేమందరమూ, దూరంగా ఒకచోట జేరాము.

'బలే దెబ్బ తగిలింది పాపం!' అని ఒకరూ 'దెబ్బా గిబ్బానూ!...ఆతాపుకి, బొళ్లాలన్నీ నేలలో దిమ్మె అయి పోయినాయి' అని మరొకరూ...

'ఈ సంకురు మయ్యను వెంట వేసుకుని మనం తిన్నగా జేరుకున్నప్పటి మాట'

'పోనీ ఇక్కడ వదలి వెళితే...'

'వచ్చును, కాని...'

'ఏం...ఈయన వచ్చి మనల్ని ఉద్ధరించేదేమిటి? లగేజ్‌లాగా జేరవేసే సరికి తాతలు దిగి వస్తున్నారు...'

'ఏం చేయమన్నావు. మరి పెద్దవాడు...

'ఆఁ పెద్దవాడే!-ఈ సైజువారే విమర్శకులై మన్ని ఈలా పీడిస్తే...నాటకాలు ఆడటమన్నా మానివేద్దాం...పగవాడికైనా వద్దు బాబూ, ఈ బరువు!

'ఉష్ - ఊరుకో...ఆయన వస్తున్నాడు..

—బస్ బాగు పడింది...కదలి, నాలుగడుగులలో కొరకొర లాడి, చప్పబడి పోయింది... ఈమారు స్టార్టు గాలేదు. నెట్టమన్నాడు డ్రయి


వరు. అందరం? దిగి సత్తువకొద్దీ...ఉహుఁ... ఊగడమే కాని, కదలందే! కారణం?–రావుజీ కూర్చునే ఉన్నాడు.

బలవంతం చేసి, బ్రతిమాలి దింపాము.

డ్రైవరు, రావుజీతో సవినయంగానే

'అయ్యా, తమరుకూడా చేయి చేసుకోవాలి కాస్త...ఒక్కరవ్వ ఓపిక చేస్తే...ఒక్క ఉరుకులో వెళ్లిపోతాము' అని ప్రాధేయపడ్డాడు.

మేము వద్దని వారిస్తూ ఉన్నా, ఏమనుకున్నాడో ఏమో, రావుజీ, చొక్కా చేతులు పైకితీసి, సగర్వంగా, చేయి చేసుకున్నాడు.



తలవని తలంపుగా స్టార్టయింది. ఆవరుగుకు రావుజీ పట్టుదప్పి వెల్లకిలా పడ్డాడు. టాప్ అంచుని ఆనుకుని అదివరకు నించి మారాం చేస్తూన్న పెట్టె, ఆతని తలకాయకు జేనెడు ఎడంగా తలక్రిందులై వాలింది.

—ఈ గత్తర గడచి, మళ్లా చేతనాచేత నాల్కి యథాస్థానాన ప్రవేశపెట్టే టప్పటికి, బస్ మళ్లా ఆగి పోయింది! – రావుజీ, కదలలేని...దిగలేని స్థితిలో ఉన్నాడు.

మా అవస్థ ఇక వర్ణనాతీతం. కదలని కారు. అందులో, మెదలలేని, కారంతటి మనిషి... ఏలా జేరుకున్నామో?

—ఇన్ని అవాంతరాలు దాటేసి, వెళ్లి వేసిన నాటకం చాలా బాగున్నది!

కాని, విమర్శ కాగ్రణి కలానికి పని తగలలేదు. ఇంతా చేసి, కష్టపడి – పెట్టి, వచ్చి, చివరకు, నాటకం చూడనే లేదు.

—బస్ - జ్వరంతో దిగాడు. తెల్లవార్లూ ఒళ్లు తెలియకుండా గ్రీన్ రూములో, చీలికలలాటి బెంచీలమీద అర్ధకాయం మాత్రం మోపి పడుకున్నాడు. వెండిపొన్నుకర్ర ప్రయాణం హడావడిలో ఎక్కడో జారిపోయిన దన్న సంగతి కూడా తెలియకుండానే!

—రావుజీ-ఇంతవరకూ మావెంట బయలు దేరలేదు మళ్లా: